సాక్షి
విశాఖపట్నం
గురువారం । 24 । ఏప్రిల్ । 2025

చంద్రమౌళికి నివాళి



ఉగ్రదాడిలో మృతి చెందిన చంద్రమౌళి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న సీఎం చంద్రబాబు, కనకదుర్గ ఆస్పత్రి వద్ద చంద్రమౌళి మృతదేహం 4లో

నేటి నుంచి చందనోత్సవం

టికెట్ల విక్రయం

ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో...



సింహాచలం: ఈనెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి రూ.300, రూ.1000 దర్శన టికెట్ల విక్రయాలు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్టు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. సింహాచలం కొండపైన దేవస్థానం పాత పీఆర్‌వో కార్యాలయం వద్ద, నగరంలోని పలు బ్యాంకుల్లో టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకుని ఆధార్ నెంబరుతో పూర్తిచేసి టికెట్లు నేరుగా పొందవచ్చన్నారు. సింహాచలంలోని యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లోను, అక్కయ్యపాలెం, కేజీహెచ్, మహారాణిపేటలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లో టికెట్లు లభిస్తాయని తెలిపారు. అలాగే బిర్లా జంక్షన్, సాలిగ్రామపురం(అక్కయ్యపాలెం) ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో టికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ వరకు మాత్రమే టికెట్లు విక్రయాలు జరుగుతాయన్నారు. చందనోత్సవం రోజు ఎలాంటి దర్శన టికెట్ల విక్రయాలు జరగవని పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం 7 నుంచి 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు పొందవచ్చని తెలిపారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.81 కోట్లు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీల ఆదాయం గత 28 రోజులకుగాను రూ.1,81,41,219 వచ్చినట్టు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. 145.100 గ్రాముల బంగారం, 11.250 కిలోల వెండి, 8 దేశాల విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్టు తెలిపారు.

ఏసీపీ పెంటారావు బదిలీ

విశాఖ సిటీ: మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ పెంటారావుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు డీజీపీ హరీష్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పెంటారావు వ్యవహార శైలిపై మహిళా పోలీస్ స్టేషన్ సీఐతో పాటు మరో మహిళ సిబ్బంది నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ చేయించిన సీపీ వాస్తవాలను డీజీపీకి నివేదించారు. ఈ క్రమంలో పెంటరావును బదిలీ చేశారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పదిలో తగ్గిన ఉత్తీర్ణత

- **పదో తరగతి ఫలితాల్లో 2 శాతం తగ్గిన జిల్లా ఉత్తీర్ణత**
- 89.14 శాతంతో 3వ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా
- 28,435 మందికి గాను 25,346 మంది పాస్
- 90.05 శాతం ఉత్తీర్ణతతో పైచేయి సాధించిన బాలికలు



వెంకటజయ 595



పల్లా అనుష్క 592



వి.వెంకట లక్ష్మి 592



ఇండిగ శ్రీవేద 593



రెడ్డి భవ్యశ్రీ 592

ఆరిలోవ : రాష్ట్రంలో బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో విశాఖ జిల్లాలో గత ఏడాది కంటే 2 శాతం ఉత్తీర్ణత తగ్గింది. 2023–24 విద్యా సంవత్సరంలో 91.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఈ ఏడాది 89.14 శాతానికి పడిపోయింది. అలాగే విశాఖ జిల్లా గతేడాది పదో తరగతి ఫలితాల్లో నాలుగో స్థానంలో నిలవగా ఈ ఏడాది మూడో స్థానానికి చేరడంతో జిల్లా విద్యాశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 28,435 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25,346 మంది(89.14 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది కూడా బాలికల హవా కొనసాగింది. 15,045 మంది బాలురు పరీక్ష రాయగా 13,288 మంది (88.32 శాతం), 13,390 మంది బాలికలు పరీక్ష రాయగా 12,058(90.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

ఫస్ట్ డివిజన్‌లో 21,833 మంది

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 25,346 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 21,833 మంది ఫస్ట్ డివిజన్, 2,367 మంది సెకండ్ డివిజన్, 1,146 మంది థర్డ్ డివిజన్‌లో ఉత్తీర్ణత పొందారు.

కార్పొరేట్ పాఠశాలలదే పైచేయి..

వేపగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇండిగ శ్రీవేద 593/600 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా నిలవగా, భీమునిపట్నం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని రెడ్డి భవ్యశ్రీ 592/600 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. జ్ఞానికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో చదివిన డబ్బీరు చరణ్‌సాయి, నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన రెడ్డి సౌజన్య 591 మార్కులతో జిల్లాలో మూడో స్థానంలో నిలిశారు. నగరంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన సాయితన్వీ 599/600, ఎ.లిఖిత 599/600, అనీష 599/600 మార్కులు సాధించారు. దీంతోపాటు 598, 597, 596 మార్కులు సాధించినవారు వేలల్లో ఉండటం విశేషం.

ఏపీ రెసిడెన్షియల్స్‌లో శత శాతం ఉత్తీర్ణత

జిల్లాలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. భీమునిపట్నం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 85 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. దీంతో పాటు ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న 10 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదిలా ఉండగా 42.17 శాతం ఉత్తీర్ణత సాధించిన ఏయూ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల జిల్లాలో అట్టడుగు స్థానంలో నిలిచింది.

సోషల్ వెల్ఫేర్‌లో 73.07 శాతం ఉత్తీర్ణత

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులు 73.07 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు వెల్లడించారు. ఈ ఏడాది వసతి గృహాలకు చెందిన 78 మంది పరీక్షలకు హాజరు కాగా 57 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. జిల్లా పరిధిలో మూడు హాస్టల్స్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరగనున్నాయని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు ఈనెల 24 నుంచి 30 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.1000 చొప్పున మే ఒకటో తేదీ వరకు ఏపీ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు.



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో నడుపూరు పాఠశాల సిబ్బంది ర్యాలీ

ఐఏఎస్ అవుతా..



పదో తరగతిలో 599 మార్కులు రావడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఇది సాధ్యమైంది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ గ్రూపు తీసుకుంటాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తిచేస్తాను. తరువాత సివిల్స్ రాసి ఐఏఎస్ అవుతాను. రాష్ట్రానికి, దేశానికి సేవలు అందిస్తాను.

– సాయి తన్వీ, 599 మార్కులు

ఐఐటీలో చదవడమే లక్ష్యం



సైన్స్ సబ్జెక్టులో రెండు మార్కుల ప్రశ్నలో చేసిన తప్పిదం కారణంగా ఒక్క మార్కు తగ్గింది. అయినా మంచి మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. అమ్మానాన్న ప్రోత్సాహంతో పాటు స్కూల్ యాజమాన్యం అందించిన సహకారంతో ఇన్ని మార్కులు సాధించగలిగాను. ప్రముఖ ఐఐటీలో ఉన్నత విద్యనభ్యసించి అమ్మానాన్నలకు మరింత పేరు తెస్తాను.

– అళ్ల లిఖిత, 599 మార్కులు

ఉగ్రదాడికి నిరసనగా

వైఎస్సార్ సీపీ శాంతి ర్యాలీ



ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

సీతమ్మధార: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అక్కడ నుంచి గుడివాడ గురునాథరావు విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ సీపీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదుల పిరికిపంద చర్యను ప్రపంచం మొత్తం ఖండిస్తుందన్నారు. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్న మట్టు పెట్టాలని, బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ప్రధానమంత్రి ఏ నిర్ణయం తీసుకున్నా దేశ ప్రజలందరూ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఉగ్రవాదులను పట్టుకొని ఉరితీయాలని మండిపడ్డారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ ఈ దాడి దేశ సమగ్రతను దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడులను సమర్థంగా తిప్పికొట్టే క్రమంలో దేశ ప్రజలంతా కేంద్రానికి మద్దతు నిలవాలన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట రామయ్య, డిప్యూటీ మేయర్లు కటుమూరి సతీష్, జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు మొల్లి లక్ష్మీఅప్పారావు, మువ్వల లక్ష్మి, బిపిన్ కుమార్ జైన్, పి.వి.సురేష్, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు పేర్ల విజయ్‌చందర్, గ్రంథాలయం జిల్లా మాజీ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నడింపల్లి కష్ణంరాజు, చిన్న జానకి రాము, అధికార ప్రతినిధులు పల్లా దుర్గ, హరి కిరణ్‌రెడ్డి, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు దొడ్డి కిరణ్, పేడాడ రమణ కుమారి, బోని శివరామకష్ణ, మారుతీప్రసాద్, సేనాపతి అప్పారావు, రాయిపురెడ్డి అనిల్, పీలా ప్రేమ్‌కిరణ్, రామిరెడ్డి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

మాజీ మేయర్ హరి వెంకటకుమారి



డాబాగార్డెన్స్: కశ్మీర్‌లో ఉగ్రదాడుల దాడి పిరికిపంద చర్యని మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడిని తీవ్రంగా ఖండించారు. దాడిలో విశాఖకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి మృతి చెందడం ఎంతో ఆందోళన కలిగించిందని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సాక్షి మీడియాపై దాడి గర్హనీయం



సాక్షిపై దాడికి నిరసనగా నినాదాలు చేస్తున్న పాత్రికేయులు

సీతమ్మధార : ఏలూరులో సాక్షి దినపత్రిక కార్యాలయంపై టీడీపీ గూండాల దాడి గర్హనీయమంటూ విశాఖలో పాత్రికేయులు బుధవారం ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ గాంధీపార్కులో సాక్షి దినపత్రిక విశాఖ బ్యూరో చీఫ్ కేజీ రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, పలు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక మీడియాపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సాక్షి బృందంపై పెట్టిన కేసుల గురించి ఆందోళనలు మరిచిపోకముందే ఏలూరు జిల్లాలో సాక్షి కార్యాలయం మీద టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడడం హేయమైన చర్య అన్నారు. డెస్క్ ఇన్‌చార్జి బి.బి.సాగర్ మాట్లాడుతూ పత్రికల్లో వచ్చే వార్తలపై అభ్యంతరాలుంటే యాజమాన్యాలకు ఖండన పంపాలి తప్ప దాడులు సరికాదన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గతంలో కూడా తహసీల్దార్‌పై దాడులు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు సాక్షి మీద కూడా దాడులకు దిగడం, అధికార పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కె.టి.రామునాయుడు మాట్లాడుతూ టీడీపీ గూండాలు పత్రికల మీద దాడి చేయడం, పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టుగా పేర్కొన్నారు. నిరసనలో సాక్షి విశాఖ యూనిట్ పాత్రికేయులు, వివిధ పాత్రికేయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

26 నుంచి ఏయూ శతాబ్ది ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఈ నెల 26న ప్రారంభం కానున్నాయని ఉపకులపతి ప్రొ.రాజశేఖర్ తెలిపారు. అకడమిక్ సెనేట్ మందిరంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ తొలి రోజు ఉదయం 6 గంటలకు ఆర్‌కే బీచ్‌లో శతాబ్ది వాక్‌థాన్‌తో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయన్నారు. ఉదయం 9 గంటల కు ఏయూ పరిపాలన భవనం వద్ద బెలూన్ లాంచింగ్, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ప్రధాన వేడుకలకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల ప్రారంభోత్సవానికి ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.మధుమూర్తి, ఐఐటీ పాలక్కడ్ డైరెక్టర్ ప్రొ.శేషాద్రి శేఖర్ అతిథులుగా హాజరవుతారన్నారు. ఇందులో భాగంగా విజన్ డాక్యుమెంట్, శతాబ్ది ఉత్సవాల వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విశ్వ విద్యాలయంలో నూతన భవనాలు, సెంట్రల్ ల్యాబ్ ఫెసిలిటీ, పూర్వ విద్యార్థుల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన జ్ఞాపికగా ప్రత్యేక ఐకానిక్ టవర్‌ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ప్రొ.ధనుంజయ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కమిషనరేట్‌కు రూ.19.12 కోట్లు

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్‌కు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.19,12,10,000 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక సంవత్సరం నాలుగు క్వార్టర్లలో ఖర్చులను అంచనా వేశారు. దాని ప్రకారం తొలి క్వార్టర్‌లో రూ.6,69,23,500, రెండో క్వార్టర్‌లో రూ.3,82,42,000, మూడో క్వార్టర్‌లో రూ.3,82,42,000, నాలుగో క్వార్టర్‌లో రూ.4,78,02,500 కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా రవాణాకు రూ.7.8 కోట్లు, అద్దెలు, ఇతరత్రా ఖర్చులకు రూ.3,07,67,000, ఆఫీస్ వాహనాల ఛార్జీలకు రూ.4.89 కోట్లు, భవన నిర్మాణాలకు రూ.కోటి వరకు కేటాయింపులు చేశారు.

పదో తరగతి ఫలితాల్లో శ్రీ విశ్వ విద్యార్థుల ప్రతిభ


టాపర్స్‌ను అభినందిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు

సీతంపేట: 10వ ఫలితాల్లో శ్రీ విశ్వ స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. షేక్ షాజిద్ అహ్మద్ 594 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. రెడ్డి బాల ఆదిత్య 593, పసుపులేటి శశాంక్ 593, జల్లు మహతి 591, మేడూరి సాహితి 589, మసాపు రోహిత్ 588 మార్కులు సాధించారు. 580కిపైగా 8 మంది, 550కిపైగా 53 మంది, 500లకు పైగా 91 మంది సాధించారు. వీరిని శ్రీవిశ్వ విద్యా సంస్థల చైర్మన్ కె.ఎస్.హెచ్.ఆర్.కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

శ్రీ చైతన్య విజయకేతనం


శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

ఆరిలోవ: 10వ తరగతి ఫలితాల్లో ఉత్తరాంధ్ర జోన్ శ్రీ చైతన్య స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారు. అనీష యండ 599 మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, అబ్దుల్ సమీర భాను, బి.హృదయ శాంతి 598 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 40 మంది విద్యార్థులు 595 మార్కులు, 257 మంది విద్యార్థులు 590 మార్కులకు పైగా సాధించినట్లు విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ విజయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. ఉత్తరాంధ్ర ఏజీఎం ఎం.వి.సురేష్, రీజినల్ ఇన్‌చార్జిలు ఆలీ, రమణ, శ్రీనివాస్, రామినాయుడు, ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్లు రాజేష్, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు విద్యార్థులను అభినందించారు.

నారాయణ విజయభేరి


టెన్త్ టాపర్ సాయితన్విని అభినందిస్తున్న ఏజీఎం రాజ్‌కుమార్

సీతమ్మధార: 10వ తరగతి ఫలితాల్లో ఆశీలమెట్టలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. పాఠశాలకు చెందిన నారాయణ శెట్టి సాయి తన్వి 599 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం, విశాఖపట్టణ పరిధిలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. వై.లక్ష్మీ చాతుర్ని 595, పి.ఆర్.ఆనంద్ 594, ఎ.నాగభరత్ 594, పి.జియాదిత్య 594, డి.శ్రీ.క్షేత్ర 594, కె.కీర్తిక 594, ఆర్.శ్రీలేఖ, శ్రీహర్ష, పి.యమున, ఎస్.తేజప్రసీద్ 593 మార్కులు సాధించినట్లు ఏజీఎం రాజ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. చక్కని క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య, కృషి, పట్టుదల వల్లే ఇంతటి ఘన విజయాన్ని సాధించగలిగామని సంతోషం వ్యక్తం చేశారు. కో–ఆర్డినేటర్లు రామ్ నరేశ్, శివ ప్రతాప్ పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో తిరుమల డైరెక్టర్లు

తగరపువలస: 10వ తరగతి పరీక్ష ఫలితాలలో తాళ్లవలస క్యాంపస్‌కు చెందిన తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. 600 మార్కులకు గానూ కె.దుర్గా కాశ్యప్, కె.శ్రీవల్లి 596 మార్కు లు సాధించారన్నారు. అలాగే జి.వెంకట్ వరుణ్ వర్షిత్, బి.కీర్తిశ్రీ, ఎం.కల్యాణ్‌రామ్ 595, ఎ.ఖ్యాతి మోధిక, కె.తన్వీర్, ఎల్.హన్సుజా, ఎస్.అమృతవర్షిణి, వై.అర్పిత విజయ 594, చిల్ల నిశాంత్‌రెడ్డి 591 మార్కులు సాధించినట్లు తెలిపారు. 42 మంది విద్యార్థులు 590 కంటే ఎక్కువ మార్కులు, 96 మంది 585 కంటే ఎక్కువ, 281 మంది 570 కంటే ఎక్కువ, 321 మంది 565 కంటే ఎక్కువ, 408 మంది 550 కంటే ఎక్కువ, 510 మంది 500 కంటే ఎక్కువ, 545 మంది 400 కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

సత్తాచాటిన శశి విద్యార్థులు

తగరపువలస: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో సంగివలస క్యాంపస్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ తెలిపారు. 600 మార్కులకు గానూ కె.రాజేశ్వర్ అఖిల్ 596 మార్కులు సాధించారన్నారు. అలాగే సీహెచ్ లోకేశ్వరి, ఎస్.వేదాంత సాయి 595, ఆర్.నిఖిల, పి.శ్యామలా శ్రీవల్లి, జి.హరిణి 594, ఎస్.మేఘశ్రీ, జీడీ జ్యోతిష్‌కుమార్, వీవీఎస్ సాయిశ్రీలిఖిత, జి.ఐశ్వర్య, బి.జ్యోత్స్న, డీవీ సాయినాయుడు 593 మార్కులు సాధించినట్లు చెప్పారు.. పరీక్షకు 412 మంది హాజరుకాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. 32 మంది విద్యార్థులు 590కు పైగా, 97 మంది 580కు పైగా, 182 మంది 570కు పైగా, 231 మంది 560కు పైగా, 284 మంది 550కు పైగా, 320 మంది 540కు పైగా, 348 మంది 530కు పైగా, 362 మంది 520కు పైగా, 378 మంది 510కి పైగా 386 మంది 500కు పైగా మార్కులు సాధించారు.

ప్రియాంక విద్యోదయ విజయదుందుభి


సాయి యామిని(595)ని అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం భగీరథ్ కుమార్

అల్లిపురం: 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో అల్లిపురంలోని ప్రియాంక విద్యోదయ హైస్కూల్ విజయదుందుభి మోగించింది. పాఠశాలకు చెందిన సాయి యామిని 595 మార్కు లు సాధించి జిల్లా స్థాయి ర్యాంక్ సాధించింది. ఈగల దుర్గా భవానీ జ్యోతిక 592, కలే దయానంద్ 590, దండు కావ్య 590 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 190 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఉపాధ్యాయుల క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఈ విజయానికి కారణమని పాఠశాల హెచ్ఎం డాక్టర్ భగీరథ్ కుమార్ దధీచి అన్నారు. విద్యార్థులను అభినందించారు.

చంద్రమౌళి భౌతికకాయానికి నివాళి


శాంతి ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



చంద్రమౌళి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

సాక్షి, విశాఖపట్నం: జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన జరజాపు చంద్రమౌళి మృతదేహం బుధవారం రాత్రి 8 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. సీఎం చంద్రబాబు ఎయిర్‌పోర్టులో చంద్రమౌళి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం చంద్రమౌళి సతీమణి నాగమణి, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. అనంతరం పార్థివదేహాన్ని మహాప్రస్థానం వాహనంలో జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న కనకదుర్గ ఆస్పత్రి వద్దకు తరలించారు. ఆయన ఇద్దరు కుమార్తెలు అమెరికా నుంచి గురువారం సాయంత్రం నగరానికి చేరుకుంటారు. శుక్రవారం అంత్యక్రియలు జరగనున్నాయి. సీఎం వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, హోంమంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు ఉన్నారు.

నవ్వుతూ వెళ్లారు..

డాబాగార్డెన్స్: కనకదుర్గ ఆస్పత్రి వద్ద చంద్రమౌళి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడి వారిని కలచివేశాయి. 'నవ్వుతూ వెళ్లారు. విగతజీవిగా తిరిగి వచ్చి అందరినీ ఏడిపించారు.' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎప్పుడూ అందరితో సరదాగా ఉండే చంద్రమౌళి అకస్మాత్తుగా తమను విడిచి వెళ్లడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామంటూ విలపించారు.

మృత్యువులోనూ వీడని బంధం

- భర్త మరణించిన 15 నిమిషాలకే భార్య కన్నుమూత
- ఒకే పాడెపై అంతిమ యాత్ర.. ఒకే చితిపై దహనం
- రెడ్డిపల్లి పంచాయతీ రామన్నపేటలో విషాదం


దంపతులు సత్యనారాయణ, రామయ్యమ్మ మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు


సత్యనారాయణ, రామయ్యమ్మ(ఫైల్)

పద్మనాభం: బంధం అంటే ఆ దంపతులదే. మృత్యువు కూడా వారిని విడదీయలేకపోయింది. భర్త ఈ లోకం విడిచి వెళ్లిన కొద్ది నిమిషాలకే భార్య కూడా ఆయన వెంటే పయనమైంది. పద్మనాభం మండలం రెడ్డిపల్లి పంచాయతీ రామన్నపేటలో చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా అందరినీ కలచివేసింది. రామన్నపేటకు చెందిన సుంకర సత్యనారాయణ (78) కొంతకాలం కిందట పక్షవాతం బారినపడి కోలుకున్నారు. పది రోజులుగా తన పనులను తానే చేసుకుంటూ చురుగ్గా తిరుగుతున్నారు. అయితే మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో సత్యనారాయణ అకస్మాత్తుగా మృతి చెందారు. భర్త మృతదేహం వద్ద భార్య రామయ్యమ్మ (73) గుండెలవిసేలా రోదించింది. ఆ దుఃఖంలోనే.. భర్త చనిపోయిన కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే రామయ్యమ్మ తుదిశ్వాస విడిచింది. జీవితాంతం అన్యోన్యంగా మెలిగిన ఆ వృద్ధ దంపతులు ఎవరిపైనా ఆధారపడకుండా తమ పనులను తామే చేసుకునేవారు. మృత్యువు కూడా వారిని విడదీయలేక ఒకే సారి ఇద్దరినీ తీసుకువెళ్లిపోవడం అందరినీ కంటతడి పెట్టించింది. వారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం ఆ దంపతులకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఇద్దరి మృతదేహాలకు పక్కపక్కనే కూర్చోబెట్టి స్నానం చేయించారు. అనంతరం ఒకే పాడెపై ఉంచి అంతిమయాత్ర నిర్వహించారు. రెడ్డిపల్లి కోమటి గుండం చెరువులోని శ్మశాన వాటికలో ఒకే చితిపై వారి దేహాలను పేర్చి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

లేటు వయసులో ఇంటర్ ఉత్తీర్ణత

63 ఏళ్ల వయసులో ఫస్ట్‌క్లాస్‌లో పాసైన అప్పారావు



అగనంపూడి: చదువు పట్ల ఆసక్తి, ఏదైనా సాధించాలనే తపన ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని నిరూపించారు పట్టా రామ అప్పారావు. అగనంపూడి నిర్వాసిత కాలనీలోని కొండయ్యవలసకు చెందిన అప్పారావు విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి ఐదేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు కళలతో పాటు విద్యపై మక్కువ ఎక్కువ. ఈ ఆసక్తితోనే 63 ఏళ్ల వయసులో ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరై ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. విశేషమేమిటంటే ఆయన 1977లో 10వ తరగతి పరీక్షలు ఉత్తీర్ణులై, వెంటనే ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించి విధుల్లో చేరారు. దాదాపు 48 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి ఫస్ట్‌క్లాస్‌లో పాసవడం ఆయనకు చదువు పట్ల ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తుంది. చదువుకోవాలనే కోరిక, కృషి ఉంటే వయసు ఎప్పుడూ అడ్డుకాదని పట్టా రామ అప్పారావు నిరూపించారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా హరనాథ్

డాబాగార్డెన్స్: ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జిల్లాకు చెందిన డి.హరనాథ్, కె. వాసుదేవరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు ప్రకటించారు. అనకాపల్లిలోయూనియన్ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యవర్గ సభ్యుల ప్రాంతీయ సదస్సు జరిగింది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయూ) కార్యదర్శి డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు సమక్షంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన వారి పేర్లు పేర్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రాము, కార్యదర్శి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, గాజువాక అధ్యక్షుడు కొయిలాడ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు అభినందనల వెల్లువ


కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు

సీతమ్మధార: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కె.కె.రాజును బుధవారం పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సీతమ్మధార దరి ఎంఎంటీసీ కాలనీలోని అతని కార్యాలయంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బహుళ నైపుణ్యాలు అవసరం


ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఫెస్ట్‌లో విద్యార్థులతో ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ సిటీ: పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా యువత బహుళ నైపుణాలతో రాణించాల్సిన అవసరం ఉందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని సాగరిక కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పుస్తక జ్ఞానం ఒక్కటే సరిపోదన్నారు. ప్రతి శాస్త్రంతో సాంకేతికత, ఏఐ, ఎంఎల్ వంటివి అనుసంధానం అవుతున్నాయని, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో కూడా వీటి ప్రాముఖ్యత ఉందన్నారు. ఏయూ సిబ్‌లో విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసించడానికి వస్తున్నారని, తద్వారా భారతీయ విద్యార్థులకు విభిన్న సంస్కృతులను పరిచయం చేసుకోవడానికి, తెలుసుకోడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక శాతం విదేశీ విద్యార్థులను కలిగిన విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తోందన్నారు. విద్యార్థులకు విదేశాల్లో సైతం ఇంటర్న్‌షిప్ అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ 26 దేశాలకు చెందిన విద్యార్థులు తమ వద్ద విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఏయూ సిబ్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాముల్లో చంద్రబాబు దిట్ట

- లిక్కర్ స్కాం జరిగింది చంద్రబాబు పాలనలోనే..
- ఖజానాకు చేరాల్సిన రూ.5 వేల కోట్లు కూటమి నేతల జేబుల్లోకి..
- మద్యం కేసులో వైఎస్ జగన్ పేరు చేర్చే కుట్ర చేస్తున్నారు
- మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సాక్షి, విశాఖపట్నం: స్కామ్‌ల్లో చంద్రబాబు దిట్ట.. రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ జరిగింది కూటమి ప్రభుత్వంలోనేనని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 11 నెలల పాలనలో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. ఎంఆర్‌పీ కన్నా అధికంగా మద్యం దుకాణాల్లో మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనలో దొంగే దొంగ అన్నట్లు ఉందని, టీడీపీ నేతల కనుసన్నల్లోనే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. నాణ్యమైన మద్యం అందిస్తామని నాసిరకమైన మద్యాన్ని అమ్ముతున్నారంటూ మండిపడ్డారు. నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి మద్యం పేరు చెప్పి ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రూ.5 వేల కోట్లు కూటమి నేతల జేబుల్లోకి వెళ్తున్నాయంటూ ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో వారి పార్టీ నాయకులకు అడ్డదారిలో డిస్టిలరీ అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ రంగంలో నాణ్యమైన మద్యం అమ్మకాలు జరిగాయని, ప్రభుత్వ రంగంలో మద్యం షాపులు నిర్వహిస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందే తప్ప, లంచాలు వస్తాయా.. అని ప్రశ్నించారు. ప్రైవేట్ రంగంలో మద్యం షాపులు నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వంలోనే లంచాలు వస్తాయన్నారు. తమ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మద్యం పాలసీలో ఒక్క బెల్టు షాపు అయినా కనిపించిందా? అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలపై కేసులు పెడుతున్నారని, మద్యం కేసులో వైఎస్ జగన్ పేరు చేర్చే కుట్రకు ఈ కూటమి ప్రభుత్వ పాల్పడుతోందని ఆరోపించారు. అంతేకాకుండా 2014–19 టీడీపీ పాలనలో చంద్రబాబు మీద ఉన్న మద్యం కేసులపైన విచారించే దమ్ముందా...? అంటూ ప్రశ్నించారు.

మంకీ క్యాప్‌తో స్పాకు ఎందుకు వెళ్తున్నావ్?

- నీ జాతకం అంతా బయట పెట్టమంటావా?
- జనసేన కార్పొరేటర్‌పై డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఫైర్
- ఒకే వార్డులో పోటీ చేద్దామా అని సవాల్


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, చిత్రంలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌పై డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని వార్డు అభివృద్ధిని విస్మరించి.. ఇతరులపై నిరాధార ఆరోపణలతో నిత్యం పత్రికా సమావేశాలు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. నగరంలోని హోటల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూర్తి యాదవ్ ఉదయం రూ.100 కోట్లు, రూ.1000 కోట్లు కుంభకోణాలు చేస్తున్నారని ఇతరులపై ఆరోపణలు చేసి.. సాయంత్రానికి స్టార్ హోటళ్లలో సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నాడని ఆరోపించారు. 2007లో తాను కార్పొరేటర్‌గా వెయ్యి ఓట్లతో గెలిచానని, తర్వాత వైఎస్సార్ సీపీలో చేరి మరలా కార్పొరేటర్‌గా గెలిచి డిప్యూటీ మేయర్ అయినట్లు గుర్తు చేశారు. బికారిగా తిరుగుతున్న పీతల మూర్తిని యూత్ కాంగ్రెస్‌లో చేర్పించింది తానేనని గుర్తు చేస్తూ.. దమ్ముంటే వచ్చే జీవీఎంసీ ఎన్నికల్లో ఒకే వార్డులో పోటీ చేద్దామా అని సవాల్ విసిరారు. స్పా, మసాజ్ సెంటర్లకు మంకీ క్యాప్ వేసుకొని ఎందుకు వెళ్తున్నావని మూర్తిని ప్రశ్నించారు. తన పాస్‌పోర్ట్ సీజ్ అయ్యిందనే ప్రచారం అవాస్తవమని, తాను ఇటీవల అమెరికా వెళ్లి వచ్చానని తెలిపారు. త్వరలో తానా సభలకు వెళ్తున్నట్లు తెలిపారు. మూర్తి యాదవ్ ప్రభుత్వ మహిళా డాక్టర్ శాలరీ కార్డు జేబులో పెట్టుకుని జల్సాలు చేస్తున్నాడని.. ప్రతి ప్రాంతంలో ఒక్కొక్క ఇంటిని మెయింటైన్ చేస్తున్నాడని ఆరోపించారు. ఎండాడలోని స్కై టవర్స్ బిల్డర్స్‌ని భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దండుకోలేదా అని మూర్తిని ప్రశ్నించారు. వార్డులో ఒక మహిళ వద్ద 90 తులాల బంగారం, రూ.30 లక్షలను మూర్తి దోచుకున్నాడని కమిషనర్‌కు ఫిర్యాదు కూడా అందిందని శ్రీధర్ చెప్పారు. చిరు వ్యాపారులను ఇబ్బంది పెడుతున్న మూర్తికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆనందపురం మండలం గిడిజాల సర్వే నం. 332/1 1.24 సెంట్లు, 332/2లో సుమారు 7.03 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేశాననే ఆరోపణలు నిరూపించాలని మూర్తియాదవ్‌కు సవాల్ విసిరారు. తాను ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు రుజువైతే.. ఆ భూములను స్వాధీనం చేసుకోవచ్చన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, బానాల శ్రీనివాస్, ఒమ్మి చిన్నారావు, కోరుకొండ స్వాతి, శశికళ, మొల్లి అప్పారావు, మువ్వల సురేష్ పాల్గొన్నారు.

ఆరోపణలపై విచారణ చేయండి


కలెక్టర్ వినతిపత్రం అందజేస్తున్న శ్రీధర్

గోపాలపట్నం: తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కోరారు. కొద్ది రోజులుగా కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తనపై ఆరోపణలు చేస్తున్నాడని.. ప్రభుత్వ భూమిని తానెక్కడ కబ్జా చేశానో తేల్చాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తన, తన కుటుంబ సభ్యుల పేరుతో రెవెన్యూ స్థలాలు ఉన్నాయో సర్వే చేయించాలన్నారు. గ్రీన్ బెల్టులు ఆక్రమించినట్లు మూర్తి యాదవ్ ఆరోపిస్తున్నాడని, అలాంటి వాటిపై సమగ్ర విచారణ జరపాలన్నారు.

సివిల్స్ విజేతకు ఘన సత్కారం


మానస, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న అకాడమీ డైరెక్టర్ గౌతమ్ తదితరులు

ఎంవీపీకాలనీ: సివిల్స్ విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానసను ఎంవీపీ కాలనీలోని వైజాగ్ ఐఏఎస్ అకాడమీ ఘనంగా సత్కరించింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన ఆమె మంగళవారం విడుదలైన యూపీఎస్‌ఈ ఫలితాల్లో 975 ర్యాంకు సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంవీపీలోని అకాడమీలో బుధవారం మానసతో పాటు ఆమె తల్లిదండ్రులు ప్రకాశరావు, ఉషారాణి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ పోతుల గౌతమ్ మాట్లాడుతూ మానస చురుకైన విద్యార్థి అని కొనియాడారు. రెండు సార్లు యూపీఎస్‌ఈలో ఆమె పలు స్టేజ్‌లకు అర్హత సాధించిందని, మూడవ ప్రయత్నంలో ఆలిండియాలో 975వ ర్యాంకు సాధించిందన్నారు. వైజాగ్ ఐఏఎస్ అకాడమీ నిరంతరం ఆమెకు వెన్నుదన్నుగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ విజయంతో వైజాగ్ ఐఏఎస్ అకాడమీతో పాటు ఉత్తరాంధ్రకు ఆమె వన్నె తెచ్చారన్నారు. మానస మాట్లాడుతూ ఈ విజయంలో తల్లిదండ్రుల పాత్రతో పాటు వైజాగ్ ఐఏఎస్ అకాడమీ కృషి ఎంతో ఉందన్నారు. సీఎస్‌బీ బాలలత అందించిన మెలకువలు తన విజయానికి దోహదపడ్డాయన్నారు. ఇక్కడితో తన జర్నీ ఆగిపోలేదని, మరోసారి యూపీఎస్‌సీ పరీక్షలకు సిద్ధమై ఆలిండియాలో టాప్ 10 ర్యాంకు సాధించడమే తన లక్ష్యమన్నారు. సివిల్స్ సాధించాలనే ఆసక్తితో పాటు ప్లానింగ్, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఆన్‌లైన్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ప్రతీ అభ్యర్థి విజయం సాధించగలరని మానస వివరించారు.

పల్లాను టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించాలి

డాబాగార్డెన్స్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆ పదవి నుంచి తొలగించాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లా శ్రీనివాసరావు తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని, ఇదే విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో మాట్లాడడం జరిగిందన్నారు. ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవికి అనర్హుడన్నారు.